క్లుప్తంగా

వైభవంగా స్నపన తిరుమంజనం



ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు

కొమ్మాది : రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం శ్రీవారి శ్రవణ నక్షత్రం సందర్భంగా స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారి ఉత్సవ మూర్తులను మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించారు. అనంతరం టీటీడీ అర్చకుల ఆధ్వర్యంలో ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు, వేద పండితులు, అధికారులు, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

నవంబర్ 28 నుంచి సర్క్యులర్ ఎకానమీపై సదస్సు

కొమ్మాది : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ బిజినెస్, ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ఎయిర్ అండ్ వాటర్ సంస్థ సంయుక్తంగా ఈ ఏడాది నవంబర్ 28 నుంచి డిసెంబర్ 1 వరకు అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నామని సదస్సు చైర్మన్ ప్రొఫెసర్ సాధన్ కె.ఘోష్ తెలిపారు. గీతం డీన్ ప్రొఫెసర్ రాజా పి.పప్పు, సదస్సు కన్వీనర్ వైఎల్‌పీ తోరణితో కలిసి సదస్సు పోస్టర్ మంగళవారం ఆవిష్కరించారు. సదస్సులో భాగంగా నవంబర్ 27న స్కూల్ చిల్డ్రన్ కాంగ్రెస్ నిర్వహిస్తామని, దేశంలోని 600 పాఠశాలల విద్యార్థులు హాజరవుతారని తెలిపారు.

చందనం, పుస్తకాలు పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

మధురవాడ : రెండు రోజులపాటు నిర్వహించిన మధురవాడ శ్రీవల్లినగర్‌లోని హజరత్ ముఖ్తియార్ ఆలీ చారిటబుల్ ట్రస్ట్ 22వ వార్షిక వేడుకలు మంగళవారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఎండీ అహ్మద్ ఆధ్వర్యంలో భక్తులకు చందనం, విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. పేదలకు భోజనం పంచి పెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్యాత్మిక కార్యక్రమాలతోపాటు సేవా కార్యక్రమాలు కూడా విస్తృతంగా నిర్వహిస్తోందని, ఇందుకు సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. వివిధ ప్రాంతాల నుంచి విశేషంగా తరలి వచ్చిన బాబా భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

పంటల సాగుపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సత్యనారాయణ రెడ్డి

మధురవాడ : రైతులు ఉద్యానవనంతోపాటు అన్ని రకాల పంటల సాగుపై అవగాహన పెంచుకోవాలని విశాఖ జిల్లా ఉద్యానవన శాఖ అధికారి కె.సత్యనారాయణ రెడ్డి సూచించారు. మంగళవారం మధురవాడ రైతు బజార్‌ను ఆయన ఇతర అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు, కొత్త వంగడాలు ఉపయోగించడంతోపాటు సేంద్రియ ఎరువులు వాడడంతో ప్రజారోగ్యానికి, పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో మండల ఉద్యానవన శాఖాధికారి పి.స్వాతి, ఉద్యానవన విస్తరణాధికారి పి.త్రినాథ్, ఎస్టేట్ అధికారి జగదీశ్వరరావు, అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా మరుగుదొడ్లు

- తొమ్మిదేళ్ల క్రితం రూ.3.5 లక్షలతో నిర్మాణం
- ప్రారంభించక ముందే శిథిలస్థితికి..
- మజ్జివలస, శింగనబంద ప్రజలకు అవస్థలు



మజ్జివలసలో నిరుపయోగంగా పబ్లిక్ టాయిలెట్లు

తగరపువలస : భీమిలి మండలం మజ్జివలసలో 2015లో రూ.3.50 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ టాయిలెట్లు ప్రారంభించక ముందే శిథిలమైపోయాయి. పురుషులకు 10, మహిళలకు 5 యూనిట్లు నిర్మించగా రన్నింగ్ వాటర్ లేకపోవడంతో వినియోగంలోకి రాలేదు. 200 కుటుంబాలకు ఉపయోగపడాల్సి వున్నా నిరుపయోగంగా మిగిలిపోయాయని పంచాయతీ ప్రజలు ఇప్పటికీ వాపోతున్నారు. స్వచ్ఛ భారత్ పథకంలో భాగంగా అప్పట్లో 25 యూనిట్ల టాయిలెట్లను ఇక్కడ నిర్మించారు. పంచాయతీలో ఎక్కువ మంది ప్రజలు నిరుపేదలే కావడంతో ఇంటింటా టాయిలెట్లు లేవు. అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో తూతూ మంత్రంగా సాగిన ఇంటింటా టాయిలెట్ల నిర్మాణంపై ప్రజలు ఆసక్తి చూపలేదు. ఇప్పటికీ ఈ పంచాయతీ ప్రజలు వ్యవసాయ భూములు, చెరువులు, గోస్తనీ నది వైపు ఆరుబయటకు వెళ్తుంటారు. వీరి కోసం నిర్మించిన టాయిలెట్లు అందుబాటులోకి రాకపోవడంతో వాటి ఆవరణనే బహిర్భూమిగా మార్చివేశారు. దీంతో ఇక్కడ జుగుప్సాకరమైన వాతావరణం నెలకొంది. దీంతో ఇటువైపు రాకపోకలు సాగించడానికి రైతులు ఇబ్బంది పడుతున్నారు.

శింగనబందలోనూ ఇదే దుస్థితి

భీమిలి మండలం శింగనబంద పంచాయతీలో 2017లో నిర్మించిన టాయిలెట్ల పరిసరాలు ప్రస్తుతం చిన్నపాటి అడవిని తలపిస్తున్నాయి. రూ.లక్షల ప్రజాధనం, లబ్ధిదారుల వాటా కలిపి నిర్మించిన టాయిలెట్లు ఇప్పటి వరకు ప్రారంభానికి నోచుకోకపోవడం విశేషం. దీంతో ఇప్పటికీ వ్యక్తిగత టాయిలెట్లు లేని ప్రజలు లింగభేదం లేకుండా బహిర్భూమిగా చెరువులు, వ్యవసాయ భూములను వినియోగిస్తుండటం బాధాకరం. ఇక్కడ టాయిలెట్లు ప్రజలకు వినియోగంలో లేకపోవడంతోపాటు అక్కడ లెక్కలేనన్ని విష పురుగులు తిష్టవేసుకుని ఉండటంతో వాటి చుట్టూ నివసిస్తున్న వారు నిత్యం ఆందోళనతో సతమతమవుతున్నారు. అప్పట్లో వ్యక్తిగత టాయిలెట్లు నిర్మించుకోలేని వారికి రాష్ట్ర ప్రభుత్వం రూ.15 వేలు, లబ్ధిదారులు రూ.1500 చెల్లిస్తే కాంట్రాక్టర్లు శివారు ప్రాంతంలో 30 కుటుంబాలకు సామూహికంగా నిర్మించారు.

రన్నింగ్ వాటరే సమస్య..

తొమ్మిదేళ్ల క్రితం మజ్జివలసలో టాయిలెట్లు నిర్మించి రెండు వాటర్ ట్యాంకులకు అనుసంధానంగా పైపులు నిర్మించారు. అయినప్పటికీ టాయిలెట్లకు నీటి వసతి లేకపోవడంతో మరో రెండుచోట్ల ప్రయత్నించినా నీరు అందుబాటులోకి రాలేదు. రన్నింగ్ వాటర్ లేమితో ప్రజలు కూడా కమ్యూనిటీ టాయిలెట్ల వైపు చూడటం మానేశారు. దీంతో టాయిలెట్ల డోర్లు, లోపలి కమోడ్‌లు విరిగిపోయాయి. రన్నింగ్ వాటర్‌కోసం వేసిన పైపులైను పక్కనే ఉన్న డ్రైనేజీలో మునిగిపోయింది. శింగనబందలో ఆరుబయటకు వేళగాని వేళ వెళ్లాలంటే ఈసడింపులు, విష పురుగులు, ముంపు సమస్యలు వేధిస్తున్నాయి. దీంతో తప్పని పరిస్థితుల్లో టాయిలెట్ల ఆవరణలోని తుప్పలను ఆశ్రయిస్తున్నారు. దీంతో వాటి చుట్టుపక్కల వాతావరణం తరచూ కలుషితమవుతోంది. పంచాయతీలో వ్యవసాయ భూములు రియల్ ఎస్టేట్ వ్యాపారుల చేతుల్లోకి వెళ్లిపోవడంతో ఆరుబయటకు వెళ్లడానికి కూడా సమస్యగా మారిందని స్థానికులు వాపోతున్నారు. వెంటనే ఈ రెండు పంచాయతీల్లోని కమ్యూనిటీ టాయిలెట్లను వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.



శింగనబందలో వినియోగించని పబ్లిక్ టాయిలెట్లు



శింగనబందలో మరమ్మతులకు గురైన టాయిలెట్లు

ప్రజలకు మెరుగైన సేవలు అందించండి



ఆనందపురం మండల ప్రజాప్రతినిధులతో సమావేశంలో మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు

మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తగరపువలస : సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు నిత్యం ప్రజల మధ్య ఉంటూ వారికి మెరుగైన సేవలు అందించాలని మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు కోరారు. మంగళవారం సాయంత్రం భీమిలిలోని క్యాంప్ కార్యాలయంలో ఆనందపురం మండల వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహాత్ముడు కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ద్వారా భీమిలి నియోజకవర్గంలో అమలు చేసి చూపించిన సంతృప్తి మనకు గత ఐదేళ్లలో కలిగిందన్నారు. నాతోపాటు ఈ సంక్షేమ, అభివృద్ధి బాటలో నడిచిన ప్రజాప్రతినిధులంతా ధన్యులయ్యారన్నారు. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయాలు, విలేజ్ క్లినిక్‌లు, ఆరోగ్య సురక్ష క్యాంపులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ఎనలేని సేవలను ప్రజల ఇంటి ముంగిటకు చేర్చామన్నారు. 'నాడు – నేడు' ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రుల రూపురేఖలే మార్చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. భవిష్యత్‌లో ఇంతలా అభివృద్ధి చేసే పార్టీ మరొకటి ఉండదన్నారు. ఆడుదాం ఆంధ్రా వంటి కార్యక్రమం ద్వారా గ్రామీణ క్రీడాకారుల్లోని నైపుణ్యాలు, ప్రతిభను వెలికి తీశామన్నారు. మరొకవైపు సీసీరోడ్లు, బీటీరోడ్లు, వీధి దీపాలు, డ్రైనేజీలు, ఇంటింటికీ పెన్షన్లు, రేషన్ పంపిణీ వంటి వసతులతో సంక్షేమ, అభివృద్ధి విప్లవం ఊరూరా తీసుకొచ్చామన్నారు. అవినీతికి తావు లేకుండా భీమిలి నియోజకవర్గంలో రూ.4250 కోట్ల అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు చేర్చిన ఘనత మనకే దక్కుతుందన్నారు. ఇదే స్ఫూర్తితో స్థానిక ప్రజాప్రతినిధులు మిగిలిన సమయాన్ని వెచ్చించి ప్రజలకు సేవ చేస్తే వారికి తేడా తెలుస్తుందన్నారు. ఎవరికి ఏ అవసరం వచ్చినా తాను అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ ఆనందపురం మండల అధ్యక్షుడు బంక సత్యం, జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, పిన్నింటి వెంకటరమణ, గంర్రెడ్డి శ్రీను, మరుపిల్లి చిన్నయ్యపాత్రుడు, కోరాడ అప్పలస్వామి నాయుడు, పాండ్రంగి శ్రీను, బోని అప్పలనాయుడు, షిణగం అప్పలరాజు, చందక సూరిబాబు, చందక అప్పలస్వామి, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ వర్సెస్ టీడీపీ

ఆ పార్టీ వ్యక్తి అక్రమాలపై కోర్టుకు వెళ్తామంటున్న కార్పొరేటర్ మంగమ్మ

మధురవాడ : జీవీఎంసీ 7వ వార్డులో టీడీపీ వర్సెస్ టీడీపీ అన్నట్లుగా పరిస్థితి తయారైంది. గత ఎన్నికల్లో టీడీపీ విజయానికి కృషి చేసిన ఆ పార్టీకి చెందిన వ్యక్తిపై అదే పార్టీ కార్పొరేటర్ తీవ్ర ఆరోపణలు చేయడంతోపాటు అతని అక్రమాలపై కోర్టును ఆశ్రయిస్తామని చెప్పడం ఈ ప్రాంతంలో తీవ్ర చర్చనీయాంశమైంది. అసలేం జరిగిందంటే... జీవీఎంసీ 7వ వార్డు మానం ఆంజనేయులు నగర్‌లో అనేక అక్రమాలు జరుగుతున్నాయని, వాటికి అధికారులు కూడా కొమ్ము కాస్తున్నారని 7వ వార్డు కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ, టీడీపీ నాయకుడు పిళ్లా వెంకటరావు ఆరోపించారు. మంగళవారం వీరు మీడియాతో మాట్లాడుతూ... ఈ ప్రాంతంలో ఓ వ్యక్తి నిజమైన లబ్ధిదారులకు చెందిన ఫ్లాట్‌లు, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి అక్రమాలకు పాల్పడుతున్నాడన్నారు. ఇక్కడి పార్కు స్థలంలో శివాలయం ఎలా నిర్మించారని ప్రశ్నించారు. సుమారు 20 నకిలీ పట్టాలు సృష్టించి నిర్మాణాలు చేసేశారని వాపోయారు. వీరికి విద్యుత్ కనెక్షన్లు ఇవ్వొద్దని తాము విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా కరెంటు మీటర్లు ఇచ్చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కోర్టు ఆర్డర్ ఉందంటూ నిర్మాణాలు చేస్తున్నారని... సదరు వ్యక్తి ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ మనిషినని అని చెప్పుకుంటూ అక్రమాలకు పాల్పడుతున్నాడని విమర్శించారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, నాయకులు విజయబాబు దృష్టికి తీసుకెళ్లామని, అవసరమైతే కోర్టుకు కూడా వెళ్తామని చెప్పారు. వారితోపాటు జనసేన నాయకుడు ఎస్ఎస్ నాయుడు ఉన్నారు. అయితే కార్పొరేటర్ ఆరోపణలు చేస్తున్న వ్యక్తి కూడా టీడీపీకి చెందిన వ్యక్తే కావడంతో ఆ పార్టీలోని వర్గ విభేదాలపై స్థానికులు చర్చించుకుంటున్నారు. సదరు వ్యక్తి గత ఎన్నికల్లో టీడీపీ తరఫున ప్రచారం కూడా చేశాడు. ఎన్నికల్లో గెలిచి రెండు నెలలు కూడా కాకముందే టీడీపీ నాయకులు రచ్చకెక్కుతున్నారని పలువురు మాట్లాడుకుంటున్నారు.

వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ



చంద్రంపాలెం హైస్కూల్‌లో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

మధురవాడ : చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.చంద్రకళ మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె ఇక్కడి విద్యార్థులు, ఉపాధ్యాయులతో వేర్వేరుగా మాట్లాడారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు గుర్తించడానికి బేస్ లైన్ పరీక్ష నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. వెనుకబడిన వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి మెరుగుపడేలా చేయాలని ఆదేశించారు. హైస్కూల్‌లో ఈ ఏడాది 750 అడ్మిషన్లు పెరిగాయని, మొత్తం విద్యార్థుల సంఖ్య 4 వేలకు చేరుతుందన్నారు. వారందరికీ సరిపడా మౌలిక వసతులు, సౌకర్యాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ఎస్‌వీఎస్ సోమయాజులు, డైట్ వైస్ ప్రిన్సిపాల్ మాణిక్యాలు నాయుడు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రాస పోలమాంబకు ప్రత్యేక అలంకరణ



ప్రత్యేక అలంకరణలో రాస పోలమాంబ అమ్మవారు

తగరపువలస : భీమిలి మండలం మజ్జివలస రాస పోలమాంబ అమ్మవారిని మంగళవారం బంతి, మల్లె పువ్వులు, తులసి మాలలతో అలంకరించి భక్తులకు దర్శనాలు కల్పించారు. ఈ అలంకరణకు మజ్జివలసకు చెందిన జీరు బంగారమ్మ, గాయత్రి సహాయ సహకారాలు అందించారు. తుపాకుల అప్పల రాసయ్య, రాసమ్మ దంపతులు భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

మైనర్లు వాహనాలు నడిపితే ప్రమాదాలు



బంగ్లామెట్ట పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ చిరంజీవిరావు

తగరపువలస: విద్యార్థులు తాము నేర్చుకున్న ట్రాఫిక్ నియమాలను తల్లిదండ్రులతోపాటు చుట్టుపక్కల నివసిస్తున్న వారికి తెలియజేయాలని భీమిలి ట్రాఫిక్ ఎస్ఐ చింతలపూడి చిరంజీవిరావు సూచించారు. జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలపై మంగళవారం అవగాహన కల్పించారు. రోడ్లపై నడిచేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, హెల్మెట్, జీబ్రా క్రాసింగ్‌పై వివరించారు. మైనర్లు వాహనాలు నడిపితే జరిగే ప్రమాదాలు తెలియజేశారు. అవగాహన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు, ఉపాధ్యాయులు బుగత మల్లిక, పిన్నింటి నాగమణి, నరహరిశెట్టి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని వృద్ధుడి మృతి

తగరపువలస : జీవీఎంసీ భీమిలి జోన్ సంగివలస సర్వీస్ రోడ్డులో మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన దుర్రి తాతయ్యలు (తాతమ్మ) స్థానిక అనిల్ ఎన్ఆర్ఐ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం... తాతయ్యలు వేకువజామున సైకిల్‌పై భీమిలి మండలం తాటితూరు పొలాలకు వెళ్లి ఉదయం 8.30 గంటల ప్రాంతంలో ఇంటికి తిరిగి వస్తున్నాడు. పాండ్రంగి – సంగివలస రహదారి నుంచి సర్వీస్ రోడ్డులోకి తిరుగుతున్న తాతయ్యలును అదే సర్వీస్ రోడ్డులో వెళ్తున్న బస్సు ఢీకొట్టడంతో గాయపడ్డాడు. క్షతగాత్రుడిని బస్సు సిబ్బందే ఎన్ఆర్ఐ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయించారు. అనంతరం పరిస్థితి విషమించడంతో మధ్యాహ్నం 1.30 సమయంలో మృతి చెందినట్టు ఆస్పత్రి సిబ్బంది తెలిపారు. భీమిలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మండల పరిషత్ సమావేశాలు నేడు

తగరపువలస : భీమిలి మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు జరుగుతుందని ఎంపీడీవో వి.జానకి తెలిపారు. ఈ సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని ఆమె కోరారు. అదేవిధంగా ఆనందపురం మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం గురువారం ఉదయం 11 గంటలకు జరుగుతుందని సంబంధిత అధికారులు తెలిపారు.

గ్రామీణ వైద్యులకు అవగాహన సదస్సు

తగరపువలస : ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో వైద్య విద్యపై అవగాహన సదస్సు మంగళవారం ఆనందపురం మండలం పెద్దిపాలెంలో నిర్వహించారు. నర్సింగ్ హోమ్ వైద్యుల రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పద్మావతి నాయుడు, రాష్ట్ర ఫెడరేషన్ గౌరవ సలహాదారుడు డాక్టర్ ఎన్.ఎల్.రావు, మరో వైద్యుడు స్వామినాయుడు మాట్లాడుతూ గ్రామాల్లో అందుబాటులో ఉండే గ్రామీణ వైద్యులు వ్యాధుల తీవ్రతను బట్టి రోగులను మెరుగైన వైద్యం కోసం పెద్ద ఆస్పత్రులకు పంపించాలని సూచించారు. అప్పుడే వారికి నాణ్యమైన వైద్యం అందుతుందన్నారు. ప్రభుత్వ గుర్తింపు కోసం పోరాడుతున్న గ్రామీణ వైద్యులకు ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌ల నుంచి తగు మద్దతు అందిస్తామని తెలిపారు. క్రమశిక్షణ కమిటీని ఏర్పాటు చేసి గ్రామీణ వైద్యులు తమ పరిధి దాటకుండా వైద్యానికి అవసరమైన విజ్ఞానాన్ని అందిస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జంగం జోషి, గౌరవ సలహాదారుడు ముమ్మల తిరుపతిరావు, జోనల్ కార్యదర్శి ఎన్.సుగుణేశ్వరి, క్యాన్సర్ ఫౌండేషన్ కార్యదర్శి మంగా శివప్రసాద్, కోన ప్రకాష్, ప్రతినిధులు కె.ఎస్.రావు, సుధాకర్‌రెడ్డి, పి.కనకారావు, రామకోటేశ్వరరావు, అను, రాలి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో భవిష్యత్ అంధకారం



మాట్లాడుతున్న ఏసీపీ సునీల్

తగరపువలస : స్థానిక శ్రీబాసర జూనియర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులకు మధురవాడ జోన్ ఏసీపీ బి.సునీల్ పలు అంశాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నియమాలు విధిగా పాటించడంతోపాటు వాటిపై ఇతరులకు కూడా అవగాహన కల్పించాలన్నారు. మాదక ద్రవ్యాలు కలిగి ఉండటం, రవాణా చేయడం, సేవించడం చట్ట వ్యతిరేకమన్నారు. వీటితో సంబంధం ఉన్న వారి భవిష్యత్ అంధకారంగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగించారు. కార్యక్రమంలో భీమిలి ఎస్ఐ గంటా హరీష్, శ్రీబాసర విద్యాసంస్థల చైర్మన్ పూడి రమేష్, ప్రిన్సిపాళ్లు చప్పా సురేష్, ఎం.భాస్కరరావు, వి.వి.డి.రమేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు

తగరపువలస : డయేరియా నిర్మూలనపై భీమిలి మండల పరిషత్ సాధారణ సమావేశ సమందిరంలో మంగళవారం అవగాహన కల్పించారు. జిల్లా పంచాయతీ అధికారి ఎం.వి.ఎ.శ్రీనివాసరావు మాట్లాడుతూ నిరంతరం అప్రమత్తంగా ఉంటూ వ్యాధులు ప్రబలకుండా పరిశుభ్రతా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వి.జానకి, విస్తరణ అధికారి అప్పలరాజు, ఐసీడీఎస్ పీవో శ్రీదేవి, గ్రామీణ నీటి సరఫరా విభాగ ఏఈ భాస్కర్, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై చర్యలకు వినతి



తహసీల్దార్‌కు వినతిప్రతం అందిస్తున్న ఏనుగులపాలెం గ్రామస్తులు

పద్మనాభం : మండలంలోని పాండ్రంగి పంచాయతీ ఏనుగులపాలెంలో సర్వే నంబర్ 317లోని ప్రభుత్వ భూమి ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆ గ్రామానికి చెందిన కె.వెంకటరావుతోపాటు 20 మంది మంగళవారం తహసీల్దార్ ఎస్.వెంకటరావుకు వినతిపత్రం అందించారు. ఈ సర్వే నంబర్‌లోని స్థలాన్ని కొంత మంది ఆక్రమించి శాశ్వత నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. ఇదే స్థలం తమ గ్రామస్తులు గొర్రెలు, మేకలు మేపుకునేవారని పేర్కొన్నారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

పద్మనాభంలో భారీ వర్షం



చెరువును తలపిస్తున్న రెడ్డిపల్లి హైస్కూల్ ప్రాంగణం

పద్మనాభం : పద్మనాభంలో పలు చోట్ల మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లు జలమయమయ్యాయి. రెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో భారీగా నీరు చేరడంతో చెరువును తలపిస్తోంది. విజయనగరం – కొంత్యాం రోడ్డులో రెడ్డిపల్లి, శేరిఖండం, పద్మనాభంలోని బుధవారం సంతకు సమీప ప్రాంతాలు జలమయమయ్యాయి. దీంతో ఈ రోడ్డుపై రాకపోకలు సాగించడానికి ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.



రెడ్డిపల్లిలో జలమయమైన రోడ్డు

వెలిగిన వీధి దీపాలు

సాక్షి ఎఫెక్ట్..



సంతపేట వీధిలో వెలుగుతున్న వీధి దీపాలు

తగరపువలస : ఎట్టకేలకు జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు సంతపేట వీధుల్లో మంగళవారం నుంచి వీధి దీపాలు వెలుగుతున్నాయి. 'అంధకారంలో సంతపేట వీధులు' శీర్షికతో సాక్షిలో ప్రచురించిన వార్తకు జీవీఎంసీ అధికారులు స్పందించారు. చీకటి కారణంగా తాము ఎదుర్కొన్న సమస్యలు వీధిదీపాలు వెలగడంతో పరిష్కారమయ్యాయని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సామూహికంగా వరి విత్తనాల శుద్ధి



పొట్నూరు గ్రామంలో వరి విత్తనాలు శుద్ధి చేస్తున్న రైతులు

పద్మనాభం : మండలంలోని పొట్నూరు గ్రామంలో రైతులు సామూహికంగా వరి విత్తనాలను బీజామృతంతో మంగళవారం శుద్ధి చేశారు. దీని వల్ల వరి పంటకు తెగుళ్లు, పురుగు సోకకుండా సురక్షింతంగా ఉంటుంది. తోనంగి అప్పలనాయుడు, చందక వెంకటరావు, కొంగరాన ఎర్నాయుడు, గొలగాని సత్యనారాయణ, జామి సూరిబాబు సామూహికంగా ఈ విత్తన శుద్ధి చేశారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఏ బాలామణి, ఐసీఆర్‌పీ మీనా పాల్గొన్నారు.